రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



## జాతీయ రహదారిపై కారు ప్రమాదం... నలుగురికి స్వల్పగాయాలు



ప్రమాదంకు గురైన కారు

**బొంరాస్‌పేట్, డిసెంబర్13, ప్రభాతవార్త :** హైదారబాద్-బీజాపూర్ జాతీయ రహదారి 163పై బొంరాస్‌పేట్ మండల పరిధిలోని రేగడిమైలారం గ్రామం దగ్గర కారు ప్రమాదంలో నాలుగురురికి స్వల్పగాయాలు కావడం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రం గురుమిట్కల్‌కు చెందిన ఒకే కుటుంబానికి చెందిన వారు హైదారాబాద్‌లోని కూకట్‌పల్లిలో నివాసం ఉంటున్నారు. హైదరాబాద్ నుండి సొంత గ్రామంకు వచ్చి స్విఫ్ట్ డిజాయిర్ కారులో తిరుగుప్రయాణం చేస్తుండగా రేగడిమైలారం గ్రామం సమీపంలో నిద్రమత్తులో ఉన్న డ్రైవర్ బైకును తప్పించబోయి ఈ ప్రమాదం జరిగి కారు పల్టీపడటం జరిగిందన్నారు. దీంతో కారులో ఉన్న నాలుగురికి స్వల్పగాయాలు కావడం జరిగిందని అన్నారు.



# డబుల్ లైన్ రహదారిగా మారేదెప్పుడు?

**షాద్‌నగర్ - హాజీపల్లి - కిషన్‌నగర్ మధ్య సింగిల్ లైన్ రహదారి**
**- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు - రహదారిని బాగు చేయాలని కోరుతున్న గ్రామస్థులు**
**- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు - నిత్యం ప్రమాదాలకు నిలయమవుతున్న రహదారి**

**షాద్‌నగర్, డిసెంబర్ 13, (ప్రభాతవార్త) :**
షాద్‌నగర్ పట్టణానికి కూత వేటు దూరంలో ఉన్న హాజీపల్లి దేశంలోనే ఆదర్శ గ్రామంగా నిలిచి అప్పటి రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ చేతుల మీదుగా అవార్డును సహితం అందు కుంది. ఆదర్శ గ్రామంగా నిలిచి షాద్‌నగర్ ప్రాంతానికి దే శం నలుమూలల నుంచి ఎందరో గొప్ప గొప్ప నాయకుల ను, అధికారులను తీసుకొచ్చిన ఘనత ఈ గ్రామానికి ఉం ది. కానీ ప్రస్తుతం ఈ గ్రామానికి వెళ్లే రహదారి మాత్రం ఇంకా సింగిల్ లైన్ రహదారిగానే ఉండిపోయింది. దీంతో ఈ రహదారి పై వాహనదారులకు రాకపోకలకు తీవ్ర అం తరాయం ఏర్పాడుతుంది. నిత్యం ప్రమాదాలకు నిలయం గా మారుతుంది.

**ఇంకా సింగిల్ లైన్ రహదారిగానే....**
ఎంతో అభివృద్ధి చెందుతున్న షాద్‌నగర్ పట్టణానికి కేవలం 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న హాజీపల్లి గ్రామానికి ప్రస్తుతం ఇంకా సింగిల్ లైన్ రహదారి మాత్రమే ఉంది. షాద్‌నగర్ పట్టణం వేగంగా విస్తరిస్తుండటంతో ఈ గ్రామ శివారులో సహితం కొత్త కాలనీలు ఏర్పాడి షాద్‌నగర్‌లో కలిసిపోయాయి. షాద్‌నగర్ పట్టణం నుంచి హాజీపల్లి మీదుగా కిషన్‌నగర్, చౌలపల్లి, చించోడ్, అయ్యవారిపల్లి, భీమారం, కొందుర్గు మండలంలోని తదితర గ్రామాలకు వెళ్లేందుకు ప్రధాన రహదారిగా ఉన్న ఈ రహదారి ప్రస్తుతం కిషన్‌నగర్ గ్రామ సమీపం వరకు సింగిల్ లైన్ రహదారిగా ఉంది. అనంతరం కిషన్‌నగర్ గ్రామం నుంచి ఈ రహదారి డబుల్‌లైన్ రహదారిగా విస్తరించి ఉంది.

**రహదారి బాగు చేయాలని గ్రామస్థుల ఆవేదన...**
పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ రహదారి నిర్మాణంలో జాప్యం ఎందుకు జరుగుతుందో ఎవరికి అర్థం కావడంలేదు. నియోజకవర్గంలో ఏన్నో గ్రామాలకు డబుల్ లైన్ రోడ్లు నిర్మాణం జరుగుతున్న కేవలం 7.5 కిలోమీటర్ల దూరం మాత్రం ఇంకా సింగిల్ లైన్ రహదారిగానే మిగిలి ఉంది. గత 8ఏళ్లుగా ఈ సింగిల్ లైన్ రహదారిని డబుల్ లైన్ రహదారిగా చేయాలని పలుమార్లు గ్రామస్థులు అధికారులకు, ప్రజాప్రతినిధులను కోరుతున్న ఈ రహదారికి మాత్రం మోక్షం కలగం లేదు. నిత్యం వాహన దారులు ప్రమాదాలకు గురవు తున్నారని గ్రా మస్థులు, హాజీ పల్లి ఉప సర్పంచి సుదర్శన్‌లు అధికారులకు వివరించిన ఫలితం లేకుండా పోయిందని ఆ గ్రామస్థులు వాపోతున్నారు. రహదారిని డబుల్ లైన్ రహదారిగా మార్చాలని ఇటీవల గ్రామ ఉప సర్పంచి సుదర్శన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జీ వీర్లపల్లి శంకర్ సహితం రోడ్డుపై బైఠాయించి నిరసన కార్యక్రమాలు చేపట్టారు.



హాజీపల్లి - కిషన్‌నగర్ మధ్యన ప్రమాదభరితంగా ఉన్న ములమలుపు

**ప్రమాదాలకు నిలయంగా మారుతున్న రహదారి..**
కేవలం 7.5 కిలోమీటర్ల రహదారి సింగిల్ లైన్ రహదారిగా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో ఈ దారి వెంట వెళ్లే వారు ఎదురుగా లారీలు, బస్సులు, టిప్పర్లు లాంటి పెద్ద పెద్ద వాహనాలు రావడంతో ప్రమాదాలకు గురవుతున్నారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ప్రధానంగా హాజీపల్లి గ్రామ సమీపంలో ఉన్న మూలమలుపు, హాజీపల్లి, కిషన్‌నగర్ గ్రామాల మధ్యన ఉన్న మూలమలుపుల వద్ద ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారని పలువురు ప్రయాణీకులు వాపోతున్నారు. 7.5 కిలోమీటర్ల ప్రయాణం నరకప్రాయంగా మారిందని గ్రామస్థులు పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చిన ఎవరు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధింత అధికారులు పట్టించుకోని ఈ రహదారిని డబుల్ లైన్ రహదారిగా మార్చాలని గ్రామస్థులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.



కిషన్‌నగర్ గ్రామ సమీపం వద్ద ప్రారంభమైన సింగిల్ లైన్ రహదారి

**వెంటనే డబుల్‌లైన్ రహదారిగా మార్చాలి : సుదర్శన్, ఉప సర్పంచి, హాజిపల్లి**
తమ గ్రామానికి సింగిల్ లైన్ రహదారి ఉండటం వల్లన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఈ దారిలో ప్రయాణం చేస్తున్న ప్రయాణీకులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఇప్పటికే అధికారులకు తెలిపిన ఎవరు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి ఇప్పటికైన తమ గ్రామానికి డబుల్ లైన్ రహదారి వేయించాలి. లేనియెడల గ్రామస్థులంతా ఏకమై ఆందోళన కార్యక్రమాలు చేపడుతాము.

## ఢిల్లీకి బయలుదేరిన మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**- తెలంగాణ రాష్ట్ర పాలన దేశం కోరుకుంటుంది**
**- మంత్రి సబితాఇంద్రారెడ్డి**



ఢిల్లీ బయలుదేరిన మంత్రి సబితాఇంద్రారెడ్డి

**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబర్ 13, (ప్రభాతవార్త) :**
బీఆర్ఎస్ పార్టీ భారత దేశ రాజకీయాల్లో ఒక నూతన శకానికి నాంది పలకాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆకాక్షించారు. ఉద్యమ పార్టీగా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ముఖ్యమంత్రి కేసీఆర్ దేశ ప్రజల కోసం ముఖ్యంగా రైతాంగం కోసం బీఆర్ఎస్ తో దేశ రాజకీయాల్లోకి వెళ్లటం శుభపరిణామాం అన్నారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో అమలువుతున్న పథకాలకు దేశ వ్యాప్తంగా ప్రజల నుంచి డిమాండ్ వస్తుందని, ఇలాంటి పాలన బీఆర్ఎస్‌తో సాధ్యమన్నారు. అబ్ కి బార్ కిసాన్ కి సర్కార్ నినాదంతో ముందుకు వెళ్తున్న కేసీఆర్‌కు దేశ వ్యాప్తంగా మద్దతు లభిస్తుందని అన్నారు. ఢిల్లీలో బీఆర్ఎస్ పార్టీ కార్యాయలం ప్రారంభం సందర్భంగా మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

## మునీరాబాద్ గ్రామాన్ని సందర్శించిన లడఖ్ ప్రాంత సర్పంచ్‌లు



మునీరాబాద్ గ్రామాన్ని సందర్శించిన లడఖ్ ప్రాంత సర్పంచ్‌లు

**మేడ్చల్, డిసెంబర్ 13. ప్రభాతవార్త ః**
స్టడీ టూర్‌లో భాగంగా లడఖ్ ప్రాంతానికి చెందిన మహిళా సర్పంచ్‌లు మంగళవారం మేడ్చల్ మండలంలోని మునీరాబాద్ గ్రామాన్ని సందర్శించారు. వారికి గ్రామ సర్పంచ్ చిట్టిమిల్ల గణేష్ స్వాగతం పలికారు. గ్రామ పరిపాలన వ్యవస్థ, అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించేందుకు విచ్చేసిన వారు గ్రామ పంచాయతీ పాలక వర్గ సభ్యులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామ పంచాయతీ పరిపాలన, సర్పంచ్‌ల విధులు, నిధుల నిర్వహన. అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. అదే విదంగా గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, నర్సరీ, వైకుంఠదామం, పార్కు, డంపింగ్ యార్డు, పాఠశాల, అంగన్‌వాడి కేంద్రాన్ని సందర్శించి పనితీరును పరిశీలించారు. ఆరోగ్య, వైద్య సదుపాయం, ఆశా వర్కర్ల పనితీరును తెలుసుకున్నారు. గ్రామ అభివృద్ధి పనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమకూరుస్తున్న నిధుల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం వారికి గ్రామ పంచాయతీ పరిపాలన, పంచాయతీ రాజ్ చట్టం, ముఖ్యమైన 24 రికార్డుల నిర్వహణ తదితర వాటిపై వారికి అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో దేవసహాయం, డిపిఓ రమణమూర్తి, ఎంపిపి రజిత రాజమల్లారెడ్డి, ఎండిఓ పద్మజ, ఎంపిఓ వినూత్న, రాష్ట్ర బాల హక్కుల సంఘం సభ్యురాలు రాగజ్యోతి, ఉప సర్పంచ్ నర్సింగ్ రావు, వార్డు సభ్యురాలు పద్మావతి, కో ఆప్షన్ సభ్యులు గిరిష్, దేవేందర్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

## పాము కాటుకు గురైన విద్యార్థి

**జిల్లెడు చౌదరిగూడ, డిసెంబర్ 13,(ప్రభాతవార్త):**
మండలంలోని పెద్ద ఎల్కిచర్ల ప్రాథమిక పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న విద్యార్థిని అక్షిత పాము కాటుకు గురైంది. ఈ విషయాన్ని ఉపాధ్యాయులు తల్లిదండ్రులు గుర్తించి కొందుర్గు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. డాక్టర్లు మెరుగైన చికిత్స కోసం నీలోఫర్ ఆసుపత్రికి తీసుకువెల్లారు. విద్యార్థినిని కాటు వేసిన పామును స్థానికులు చంపి ఆసుపత్రికి తీసుకువెల్లారు. విద్యార్థిని ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు కుటుంబీకులు తెలిపారు.

## ఫర్టిలైజర్స్ దుకాణాలపై జిల్లా టాస్కఫోర్స్ పోలీసుల దాడులు

**-అనుమతులు లేని క్రిమిసంహారక మందులు స్వాధీనం**



మాట్లాడుతున్న సిఐ రాంబాబు

**పెద్దేముల్, డిసెంబరు 13, ప్రభాతవార్త:**
పెద్దేముల్ మండల కేంద్రంలోని బాబా ఫర్టిలైజర్స్, కేజీఎన్, శ్రీనివాస ఫర్టిలైజర్స్ దుకాణాలపై జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు, మండల వ్యవసాయ అధికారులు కలిసి సంయుక్తంగా మెరుపు దాడులు చేశారు. అనుమతులు లేని అసిపెట్ 60 కిలోలు, 2.3 కిలోల రీచ్ ఫాడర్‌ను స్వాధీనం చేసుకొని దుకాణపు యజమానులను అదుపులోకి తీసుకున్నారు. తాండూరు రూరల్ సిఐ రాంబాబు మాట్లాడుతూ విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ సిఐ వెంకటేశం తన సిబ్బందితో మంగళవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని బాబా, కేజీఎన్, శ్రీనివాస ఫర్టిలైజర్స్‌పై దాడులు నిర్వహించారు. బాబా ఫర్టిలైజర్స్‌లో బిల్లులు లేని ప్రభుత్వ నిషేదిత క్రిమిసంహారక మందులు 60 కిలోల అసిపేట్ పౌడర్, 100 గ్రాముల 23 బాటిల్స్ రీచ్ పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేజీఎన్ ఫర్టిలైజర్స్‌లో కాలం చెల్లిన విఫుల్ ప్లాంట్‌గ్రోత్ పౌడర్, సిఎమ్ 75 ఫంగిసైడ్ మందులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బాబా ఫర్టిలైజర్ యజమాని నయ్యుంను, కేజీఎన్ ఫర్టిలైజర్ యజమాని ఖాజపాషను అదుపులోకి తీసుకొని వారిపై 29(3) ఇన్‌సెక్టిసైడ్ యాక్ట్ 1968, రూల్ (10) ఏ యాక్ట్ 1971 ఐపిసి 188 ప్రకారం కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ వివరించారు. దాడులలో మండల వ్యవసాయ అధికారి నసీరుద్దిన్, పెద్దేముల్ ఎస్ఐ రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

## వెంకట్రావుపేటలో అక్రమంగా మట్టి తరలింపు

**-చర్యలు తీసుకోవాలని అధికారులకు గ్రామస్తుల వినతి**

**తలకొండపల్లి డిసెంబర్12, ప్రభాతవార్త :**
తలకొండపల్లి మండల పరిధిలోని వెంకట్రావుపేట్ గ్రామంలో గల కొన్ని రోజులుగా గ్రామంలోని ప్రభుత్వ భూమి నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్లు గ్రామస్తులు మంగళవారం సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామస్థుల వివరాల ప్రకారం మండల పరిధిలోని వెంకటారావుపేట్ గ్రామంలోని సర్వే నెంబర్ 58లో గల ప్రభుత్వ భూమిలో కొంతమంది రియల్ ఎస్టే వ్యాపారులు భూమిలోని మట్టిని అవసరాల కోసం ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి గైరాను భూమిలోని మట్టిని రియల్ వ్యాపారులకు ట్రిప్పుకు 1500 చొప్పున అమ్ముతున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కానుగుల వెంకటయ్య, నాయకులు శివశంకర్‌లు ఆరోపిస్తున్నారు. గత 15,20 రోజులుగా అక్రమంగా మట్టి తరలిస్తున్నా గ్రామ కార్యదర్శి జహీరుద్దీన్ చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నాడని వారు ఆరోపించారు. మంగళవారం కందుకూరు ఆర్డీవోకు ఫోన్‌లో ఫిర్యాదు చేశామని సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని వారు డిమాండ్ చేశారు. లేనిచో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వారు తెలిపారు.



ప్రభుత్వ భూమిలో మట్టిని తవ్విన్న దృశ్యం

# రోడ్డు భద్రతలను పాటించాలి : జిల్లా ఎస్పీ కోటిరెడ్డి

**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**
ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది కల్గకుండా రోడ్డు భద్రతలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా పోలీస్ వారికి సహకరిస్తూ ప్రతి ఒక్క ప్రయాణం సాఫీగా సాగే విధంగా అన్ని శాఖల అధికారులు కలిసికట్టుగా పనిచేద్దామని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి సూచించారు. మంగళవారం ఆర్‌టిసి, ఆర్‌టిఓ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ....రోడ్డు ప్రమాదాలను ఏ విధంగా నివారించాలో తెలియజేయడం జరిగింది. ఆర్‌టిసి అధికారులు ప్రతి ఒక్క బస్ డ్రైవరుతో రోడ్డు భద్రత గురించి మాట్లాడి వారు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలని అనే విషయాన్ని స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. బస్ ప్రయాణించే ముందు ప్రతి ఒక్క బస్ డ్రైవరును డ్రంక్ అండ్ డ్రైవ్ చెక్ చేయాలి మరియు ఆక్సిడెంట్ జరగకుండా జాగ్రత్తగా డ్రైవ్ చేసే విధంగా కౌన్సిలింగ్ ఇవ్వాలని ప్రతి బస్సు కండిషన్ చెక్ చేసుకోవాలని ఈ మధ్య కాలంలో ఎక్కువ బస్ రోడ్డు ప్రమాదాలు కేవలం బస్ బ్రేక్ డౌన్ అవ్వడం వలనే జరుగుతున్నాయని. కావున ఇటువంటి మళ్లీ జరగకుండా చూసుకోవాలి, అనంతగిరి లాంటి ఎత్తైన ప్రదేశాలలో తిరిగే బస్ స్థితిగతుల్ని ప్రతిసారి పరిశీలించాలని. ప్రమాదాలు జరిగిన వెంటనే ఘటన స్థలానికి డిపో మేనేజర్, సంబంధిత అధికారులు ఘటన ప్రదేశానికి చేరుకొని ప్రజలు చేస్తున్న ఆందోళనను కొంత వరకు తగ్గించాలి ఘటన స్థలానికి పోలీసు వారితో పాటు ఆర్టిసి డిపార్ట్‌మెంట్ అధికారులు కూడా ఉంటే సమస్యను సులయాసంగా నివారించవచ్చుని కావున పోలీస్ వారికి సహకరించాలని తెలియజేశారు. ఆర్టిఓ అధికారులు బస్ ప్రమాదానికి ఎందుకు గురి అయ్యిందనే విషయాన్ని తెలుసుకొని తర్వాత ఇటువంటివి జరగకుండా చూసుకోవాలని తెలిపారు. వర్షకాలంలో మంచు కురుస్తున్న సమయంలో జాగ్రత్తగా బస్సులు నడపలని తెలిపారు. ఆర్టిసి డ్రైవరు అన్ని నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని బస్ టాప్ పైకి ఎవ్వరిని కూడా ఎక్కించరాదని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. అనంతరం ఎంవిఐ మేఘన మాట్లాడుతూ...ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనాలపై చర్యలు తీసుకోవాలని జిల్లాలో అధిక బరువు కలిగిన వాహనాలపై చర్యలు తీసుకోవాలని లారీలు అధిక బరువులతో ఇబ్బందులు కల్గిస్తున్నాయని. కావున లోకల్ పోలీస్ నిర్వహించే నకబంది, వాహన చెకింగ్‌లో పాల్గొనలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఎం.ఎ రషీద్, డిప్యూటీ ఆర్‌ఓ జ్యోతి, తాండూరు డిఎస్పీ శేఖర్ గౌడ్, పరిగి డిఎస్పీ కరుణాసాగర్, డిఎస్పీ సత్యనారాయణ, తాండూర్, పరిగి, వికారాబాద్ డిఎంలు, ఎంవిఐ మేఘన, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



## కూరగాయలు, పండ్లతోటల సాగుపై రైతులకు అవగాహన

**శామీర్‌పేట, డిసెంబరు 13, ప్రభాతవార్త**
కూరగాయలు, పండ్లతోటల సాగుపై రైతులకు శామీర్‌పేట మండల అలియాబాద్ రైతు వేదికలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీకృష్ణ అవగాహన కల్పించారు. మంగళవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ రైతు వేధికలో మేడ్చల్ జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమశాఖ ఆధ్వర్యంలో రైతులకు కూరగాయ పంటలు, పండ్లతోటలపై, పట్టు పరిశ్రమపై కూడ రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. దీనిలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీకృష్ణ మాట్లాడుతూ కూరగాయలు, పండ్లతోటల సాగులో మెలకువలను, ఛీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కూరగాయ పంటలు, పండ్లతోటల సాగు వల్ల అన్ని రకాల రైతుకు ఆదా అవుతుందని ఆరుతడి పంటలు లాభసాటిగ ఉంటాయన్నారు. జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమశాఖ అధికారి నీరజగాంధీ జిల్లాలో అమలు అవుతున్న హార్టికల్చర్, పట్టు పరిశ్రమలకు సంబంధించి పలు పథకాలపై రైతులకు అవగాహణ కల్పించారు. ఉద్యానవన పంటలతో పాటు పట్టు పరిశ్రమలో పట్టు పెంపకంపై కూడ ఆమె సలహాలు, సూచనలు ఇచ్చారు. రైతుల అవగాహణ సదస్సులో ఉద్యానవన పంటల సాగు వల్ల లాభాలను, రైతు అనుభవాలను రైతులకు వివరించారు. రైతులు పలువురు కూరగాయల, పండ్ల తోటల సాగు క్షేత్ర స్థాయిలో పంటల విషయంపై రైతులు శాస్త్రవేత్త నుంచి సలహాలు, సూచనలు అడిగి తెలుసుకోవటం జరిగింది. ఈ రైతుల అవగాహన సదస్సులో శామీర్‌పేట మండల వ్యవసాయ అధికారి రమేశ్, ఉద్యానవన అధికారి కె. రేణుక, అలియాబాద్ ఎంపిటిసి కోడూరి అశోక్, వ్యవసాయ విస్తీర్ణ అధికారి రవి, పలువురు రైతులు పాల్గొన్నారు.



శామీర్‌పేట మండల అలియాబాద్ రైతు వేదికలో జరిగిన రైతుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీకృష్ణ, పాల్గొన్న జిల్లా హార్టికల్చర్ అధికారి నీరజగాంధీ, జిల్లా రైతుబంధు అధ్యక్షులు నందారెడ్డి, వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు

## విద్యుత్‌షాక్ తగిలి బాలుడు మృతి


**-గాలిపటం ఎగరవేస్తుండగా ఘటన**

**బషీరాబాద్, డిసెంబర్13, ప్రభాతవార్త ః**
గాలిపటం ఎగరేస్తూ విద్యుత్‌షాక్ తగిలి బాలుడు మృతి చెందిన సంఘటన సోమవారం నాడు బషీరాబాద్ మండల పరిధిలోని దమర్చేడ్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దాసరి అనిత, శివకుమార్ దంపతులకు ఇద్దరు సంతానం ఉన్నారు. అందులో పెద్ద కుమారుడు అఖిల్ వయస్సు(10) సోమవారం సాయంత్రం తన స్నేహితులతో కలసి పోచమ్మ ఆలయం సమీపంలో గాలిపటం ఎగరవేస్తుండగా దారం విద్యుత్‌వైర్లకు తగిలి తెగిపోవడంతో గాలిపటాన్ని తీసుకోవటానికి వెళ్లగా అక్కడే తెగిపడి ఉన్న జియ్యా వైర్ బాలుడి మెడకు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. బాలుడి మృతిపట్ల ఎవరిపై ఎలాంటి అనుమానం లేదని తల్లిదండ్రులు పోలీస్‌లకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.


## చక్కదిద్దబోయి బుక్కయ్యారు

**-సెలవులో ఉన్న ఉపాధ్యాయుడికి ఇంచార్జీ హెచ్‌ఎం**

**జిల్లెడు చౌదరిగూడ, డిసెంబర్ 13,(ప్రభాతవార్త):**
చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు ఓ జీహెచ్‌ఎం సెలవు పత్రాన్ని దిద్ది హెచ్‌ఎంను తప్పించబోయి తాను అడ్డంగ బుక్కయ్యాడు. ఈ సంఘటన వివరాలు పరిశీలిస్తే జిల్లెడు చౌదరిగూడ మండలంలోని పెద్ద ఎల్కిచర్ల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినిని పాము కాటు వేసింది. ఈ పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు విద్యార్థులు ఉండగా ఆరుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. మంగళవారం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే పాఠశాలకు హజరు అయ్యారు. దీంతో కొందరు విద్యార్థులు పాఠశాల ఆవరణలో కాలిగ తిరుగుతు కనిపించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నల్గొండ శ్రీనివాస్ పాఠశాలకు హజరు కాలేదు. పై సంఘటనతో ఉలిక్కిపడి సెలవు పత్రాన్ని జీహెచ్‌ఎం రవీందర్‌రెడ్డికి ఇచ్చానని మిడియాకు చెప్పుకోచ్చారు. దీంతో మిడియా సెలవు పత్రాన్ని ఎంపీడీఓ మహేష్‌బాబు, తహసీల్దారు విజయ్‌కుమార్ సమక్షంతో పరిశీలించగ తేది 03 రోజున రాసిన సెలవు పత్రంలో వైట్‌నర్‌తో చెరిపి 12గా మార్పు చేశారు. ఇది స్పష్టంగా కనిపిస్తుంది. ఇందులో మరో తిరకాసు ఎమిటంటే డెంగ్యూ ఫివర్‌తో సెలవుల్లో ఉన్న వెంకట్‌రావు ఉపాధ్యాయునికి ఇంచార్జ్ హెచ్‌ఎంగా బాధ్యతలు అని రాసి ఉండగా జీహెచ్‌ఎం రవీందర్‌రెడ్డి అప్రూవ్ అంటు ధృవీకరించడం సెలవు పత్రం తేదిని దిద్దారు అనడానికి చక్కటి నిదర్శనం. పాము కాటు సంఘటన భాద్యత తప్పించు కోవడానికి ప్రాథవమిక పాఠశాల హెచ్‌ఎం నల్గొండ శ్రీనివాస్ వేసిన ఎత్తుగడను చక్కదిద్దబోయిన జీహెచ్‌ఎం రవీందర్‌రెడ్డి అడ్డంగ బుక్యయ్యాడు. ఈ సంఘటన తెలిసిన గ్రామస్తులు ఉపాధ్యాయుల తీరుపై అగ్రహం వ్యక్తం చేశారు. ఇలా వ్యవ హారించిన హెచ్‌ఎంలపై విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వైట్‌నర్‌తో దిద్దిన సెలవు పత్రం ఇదే



రిజిష్టరులో ఇంచార్జీ హెచ్‌ఎం సీఎల్

